ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
శుక్రవారం 21 మార్చి 2025

మైనింగ్ నిధులు జిల్లా అభివృద్ధికే ఉపయోగించాలి

● విధాన పరిషత్‌లో ఎమ్మెల్సీ వైఎం సతీష్ బాబు

వివరాలు 8లో..

నమో నారసింహా..!

● అట్టహాసంగా ఖాద్రీశుడి బ్రహ్మరథోత్సవం ● గోవింద నామస్మరణతో మార్మోగిన తిరువీధులు ● ఉదయం 8.16 గంటలకు కదిలిన బ్రహ్మరథం
● మధ్యాహ్నం 3.56 గంటలకు యథా స్థానానికి.. ● వేలాది మంది భక్తులతో కిటకిటలాడిన కదిరి


అలంకరణలో ఖాద్రీశుడు


భక్తుల మధ్య సాగుతున్న రథం

కదిరి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మ రథోత్సవం కన్నులపండువగా సాగింది. వేలాది మంది భక్తుల గోవింద నామస్మరణతో పుర వీధులు మార్మోగాయి. తిరువీధులు కిక్కిరిసి పోయాయి. రథంపై దేవదేవుడిని వీక్షించిన భక్తులు.. తన్మయత్వంతో నమో నారసింహ అని నినాదాలు చేశారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలలో అత్యంత ముఖ్యమైనది బ్రహ్మరథోత్సవం. ఈ వేడుకకు రాయలసీమ, కర్ణాటక, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. స్వామివారి బ్రహ్మరథోత్సవం గురువారం ఉదయం 8.16 గంటలకు ప్రారంభమైంది. అంతకు ముందు వేద పండితులు రథారోహణం గావించారు. రథం వద్ద ఆలయ ప్రధాన అర్చకులు ఏవీ నరసింహాచార్యులు, ఏవీ పార్థసారథి ఆచార్యులు పుణ్యాహావచనం, బలిహరణ, కుంభహారతి నిర్వహించారు. అనంతరం రథంలో స్వామివారి ఆరాధన, అక్షతారోహణం చేశారు. శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీవారిని

(తరువాయి 7లో..)


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మళ్లీ చిరుత సంచారం..!

● రాయచూరు సమీపంలో చిరుత జాడలతో భయం భయం


పొలాల్లో పరిశీలిస్తున్న అటవీ సిబ్బంది


చిరుత పాద ముద్రలు

రాయచూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నగర సమీపంలోని మలియాబాద్ అటవీ పరిసరాల్లో మరోసారి చిరుత కలకలం చెలరేగింది. గురువారం తెల్లవారు జామున గ్రామానికి చెందిన గేదె దూడను చిరుత చంపి వేయడంతో ఒక్కసారిగా గ్రామంలో భయానక వాతావరణం నెలకొంది. కొన్నాళ్ల క్రితం చిరుత సంచరిస్తున్నట్లు గ్రామస్థులు చేసిన ఫిర్యాదుపై నిఘా ఏర్పాటు చేసి బోను అమర్చిన అటవీ శాఖ అధికారులు నెల రోజుల క్రితం ఒక చిరుతను బంధించారు. చిరుత బంధించిన వెంటనే ఊపిరి పీల్చుకున్న ప్రజలు ఆ సంగతే మరిచిపోయి ఉన్న తరుణంలో మరో సారి గేదెను చిరుత బలిగొనడం కలకలం రేపింది. ఈ సందర్భంగా కొంతమంది గ్రామస్థులు బుధవారం సాయంత్రం తాము పొలాల నుంచి తిరిగి ఉన్నుండగా చిరుత జాడలు కనిపించాయంటూ చెప్పడం ఒక్క సారిగా గ్రామంలో కలకల రేగింది. దీంతో ప్రజలు రాత్రి వేళ బయటికెళ్లాలంటే భయం పడే పరిస్థితి తలెత్తింది. కొన్ని పెంపుడు జంతువులను సైతం ప్రజలు ఇళ్లల్లో కట్టివేసుకోవడం గమనార్హం. ఇప్పటికే అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన గ్రామస్థులు నిఘా ఏర్పాటు చేసి తమకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు. గ్రామ పరిసరాలు పూర్తిగా దట్టమైన అడువులు ఉండడం వల్లే తమకు ఈ ప్రమాదం ఉందంటూ గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. దీని పై స్పందించిన జిల్లా అటవీ శాఖ అధికారి గ్రామస్థులు రాత్రివేళ బయటికి వెళ్లవద్దని ఇప్పటికే ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసి పెట్రోలింగ్ సిబ్బందిని కూడా పెంచామన్నారు. తప్పనిసరిగా చిరుతను బంధిస్తామని ఈ విషయంలో గ్రామస్థులు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు.

రేపటి రాష్ట్ర బంద్‌కు పలు సంఘాలు దూరం

● మద్దతివ్వని కరవే సహా పలు యూనియన్లు

బెంగళూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): బెళగావిలో మరాఠాల దౌర్జన్యాలను నిరసిస్తూ 22న శనివారం నిర్వహించతలపెట్టిన కర్ణాటక బంద్‌కు పలు సంఘాలు దూరంగా ఉన్నాయి. కన్నడ సంఘాల ఐక్య కూటమి అధ్యక్షుడు వాటాళ్ నాగరాజు కర్ణాటక బంద్‌కు 20రోజులకు ముందుగానే పిలుపునిచ్చారు. బెళగావిలో ఆర్టీసీ కండెక్టర్‌పై దాడిని నిరసిస్తూ రాష్ట్ర బంద్ చేపట్టాలని వాటాళ్ నాగరాజు కోరారు. ఆయనతో నిరంతరంగా ఉండే పలు సంఘాలు మద్దతు ఇచ్చాయి. బంద్‌కు పిలుపు ఇచ్చిన రోజునే కర్ణాటక రక్షణ వేదిక అధ్యక్షుడు నారాయణగౌడ ప్రత్యేకంగా తాము బంద్‌కు మద్దతు ఇవ్వడం లేదని ప్రకటించారు. ఇలా పలు సంఘాలు వ్యతిరేకత వ్యక్తం చేశాయి. కానీ వాటాళ్ నాగరాజు కూటమి మాత్రం ఎట్టి పరిస్థితిలోను బంద్ చేపట్టి తీరుతామన్నారు. బెంగళూరులో టౌన్‌హాల్ నుంచి ఫ్రీడం పార్కు దాకా ర్యాలీ చేస్తామన్నారు. హోటళ్ల యాజమాన్య సంఘం, బస్సు డ్రైవర్ల సంఘం, విద్యాసంస్థల వాహనాల డ్రైవర్ల సంఘం, ఓలా, ఉబెర్ క్యాబ్ డ్రైవర్‌ల సంఘం, సారథి ఆటో డ్రైవర్‌ల సంఘాల ప్రతినిధులు బంద్‌కు నైతిక మద్దతు ఇచ్చాయి. అయితే బంద్ కారణంగా వాహనాలు నిలిపివేస్తామని ప్రకటించలేదు. తాజాగా నేషనల్ వెహికల్ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గండసి సదానందస్వామి బంద్‌కు మద్దతు ఇచ్చేది లేదని ప్రకటించారు. దీంతో బంద్ ప్రభావం ఏవిధంగా ఉంటుందనేది వేచి చూడాల్సి ఉంది.

ఆకాశ రామయ్య..!


తుమకూరు జిల్లా పర్యటనలో హెలిక్యాప్టర్ దిగుతున్న సీఎం (ఫైల్)

రికార్డులకెక్కిన సీఎం సిద్దరామయ్య విహంగ ప్రయాణం

21 నెలల్లో రూ.32 కోట్లు

సమీప నగరాలకూ హెలిక్యాప్టర్ల వాడకంపై సభలో ప్రతిపక్షాల విమర్శలు

బెంగళూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): సీఎం సిద్దరామయ్య మరో రికార్డు సాధించారని ప్రతిపక్షనాయకులు ఎద్దేవా చేస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం సిద్దరామయ్య విమానం, హెలీక్యాప్టర్‌ల ద్వారా ప్రయాణాలకు ఏకంగా రూ.32 కోట్లు ఖర్చు చేశారు. విధానపరిషత్‌లో జేడీఎస్ సభ్యుడు జవరాయిగౌడ అడిగిన ప్రశ్నకు సభానాయకుడు బోసరాజు వివరణ ఇచ్చారు. ఇదే సందర్భంలోనే సభ్యుడు జవరాయిగౌడ స్పందిస్తూ గ్యారెంటీ పథకాలకు ఏకంగా రూ.50వేల కోట్లగా పైగా ప్రభుత్వం ఖర్చు చేస్తోందని మరో వైపు బెంగళూరులో రోడ్లు గుంతలుగా మారాయని అందుకే ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆకాశంలోనే తిరుగుతున్నారా అంటూ ప్రశ్నించారు. మొత్తానికి తక్కువ సమయంలో అధికంగా తిరిగిన సీఎంగా రికార్డు సాధించారని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. సీఎం సిద్దరామయ్య రాష్ట్ర పర్యటనలకు దాదాపు హెలీక్యాప్టర్‌లను ఉపయోగిస్తారు. ప్రత్యేకించి విమానాశ్రయాలు కలిగిన బెళగావి, మంగళూరు, హాసన్, దావణగెరె, మైసూరు, విజయనగర వంటి ప్రాంతాలకు విలాసవంతమైన చాప్టర్‌ను ఉపయోగిస్తారు. ఇక మిగిలిన ప్రాంతాలకు హెలీక్యాప్టర్‌లో ప్రయాణాలు చేస్తారు. 2023 మేనెలలో సీఎం సిద్దరామయ్య ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2025 జనవరి 15వ తేదీ వరకూ వివిధ ప్రాంతాల పర్యటనలకు ఏకంగా రూ.31 కోట్లు ఖర్చు చేశారు. 2023-24వ ఆర్థిక సంవత్సరంలో రూ. 12.65 కోట్లు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జనవరి 15వ తేదీ వరకూ రూ.19.35 కోట్లు ఖర్చు చేశారు. ఇలా సుమారు 21 నెలలకుగాను ఏకంగా 32కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. ఇటీవల ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు మోకాలి నొప్పికి చికిత్సలు పొందిన మేరకు దాదాపు రెండునెలలుగా బెంగళూరు వీడి ఎక్కడికీ వెళ్ళలేదు. బెంగళూరుకు సమీపంలో ఉండే మైసూరు, తుమకూరు నగరాలకు సైతం ముఖ్యమంత్రి హెలిక్యాప్టర్‌లు, ఛాప్టర్‌లను వినియోగించడం విమర్శలకు కారణమవుతోంది. అయితే కాంగ్రెస్ నేతలు ఆరోపణలను తిప్పికొడుతున్నారు.


కేఎస్ఆర్‌పీ మహిళా బెటాలియన్

విధానసౌధ.. సీఎం నివాసాలకు

నారీ రక్షణ..!

నిరసనలు, ముట్టడి కట్టడికి కేఎస్ఆర్‌పీ నిర్ణయం



బెంగళూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాలనా శక్తికేంద్రం విధానసౌధ, వికాససౌధ, బెళగావిలోని సువర్ణసౌధతోపాటు ముఖ్యమంత్రి అధికారిక నివాసం కృష్ణ, కావేరిల రక్షణకు నారీశక్తిని రంగంలోకి దించనున్నారు. ఇకపై శక్తికేంద్రాలతోపాటు సీఎం నివాసప్రాంగణంలో నిరసనలు, ముట్టడి, రాళ్లదాడిలాంటి సంఘటనలు చోటు చేసుకుంటే లాఠీదెబ్బలు చవిచూడాల్సిందే. బందోబస్తు నిర్వహణకు మహిళా రక్షణా సిబ్బందిని సద్వినియోగం చేసుకోవాలంటూ కర్ణాటక స్టేట్ రిజర్వు పోలీస్ (కేఎస్ఆర్‌పీ) సిద్ధమైంది. ఉన్నతాధికారులు దీనిపై కసరత్తు జరుపుతున్నారు. ప్రస్తుతం కేఎస్ఆర్‌పీ బెటాలియన్‌లో వందమంది మహిళా సిబ్బందితో ప్రత్యేకమైన బెటాలియన్‌ను ఏర్పాటు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. శాంతిభద్రతల పరిస్థితి అదుపు తప్పినప్పుడు మహిళా బెటాలియన్‌లను రంగంలోకి దించాలని భావిస్తున్నారు. బందోబస్తు చర్యల్లో కేఎస్ఆర్‌పీ బృందాలు కీలకంగా పనిచేస్తున్నాయి. రాష్ట్రంలో 14 కేఎస్ఆర్‌పీ బెటాలియన్‌లు ఉన్నాయి. ప్రతి బెటాలియన్‌లోనూ వందమందితో 9 ప్లాటూన్లు ఉన్నాయి. తొలిసారి బెళగావి బెటాలియన్‌లో మహిళా ప్లాటూన్ ప్రారంభించారు. ఆ తర్వాత బెంగళూరులో రెండు ప్లాటూన్లు ప్రారంభమయ్యాయి. శాంతిభద్రతలు దారితప్పినప్పుడు కేఎస్ఆర్‌పీ బలగాలను రంగంలోకి దించి ఎటువంటి అల్లర్లు అయినా అదుపులోకి తెచ్చే దాకా క్రియాశీలకంగా వ్యవహరిస్తారు. మహిళా ప్లాటూన్ల సేవలు సద్వినియోగం చేసుకునేందుకు ప్రభుత్వం సమ్మతించేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది.

రాజధాని బెంగళూరు రక్షణకోసం సరిహద్దు జిల్లాల్లో కేఎస్ఆర్‌పీ బెటాలియన్లను స్థాపించారు. ఇప్పటికే బెంగళూరు గ్రామీణ జిల్లా దేవనహళ్ళి తాలూకా ఆవతి గ్రామంలో కేఎస్ఆర్‌పీ బెటాలియన్‌ను ప్రారంభించారు. మరో బెటాలియన్‌ను రామనగర జిల్లాలో ఏర్పాటు చేయదలిచారు. తుమకూరు, కోలారు జిల్లాల్లోనూ కేఎస్ఆర్‌పీ బెటాలియన్లను ఏర్పాటు చేయదలిచారు. ఇలా నగర అనుబంధ జిల్లాల్లో బెటాలియన్లు ఏర్పాటు చేయడం ద్వారా అత్యవసర పరిస్థితి అనిపిస్తే సంబంధిత బెటాలియన్ల నుంచి ఏకకాలంలో వందలాది మందిని రంగంలోకి దించి అదుపు చేయాలని భావిస్తున్నారు.

కొత్తగా మహిళా ప్లాటూన్లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వానికి ఆర్థికంగా అదనపు భారం కాదు. ప్రస్తుతం మంజూరైన 9 బెటాలియన్లలో ఒక బెటాలియన్‌ను మహిళలకు రిజర్వు చేస్తారు. మహిళలను భద్రతా సేవల్లో ఎక్కువగా ఉపయోగించుకోవాలనేది కేఎస్ఆర్‌పీ ఆలోచనగా ఉంది.

పీఈఎస్ యూనివర్సిటీ చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ జవహర్ దొరస్వామి



బెంగళూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పీఈఎస్ యూనివర్శిటీ చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ జవహర్ దొరస్వామి నియమితుడయ్యారు. హనుమంతనగర్ క్యాంపస్‌లో మేనేజింగ్ కమిటీ ప్రత్యేకంగా భేటీ అయింది. తొలుత పీఈఎస్ యూనివర్శిటీ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామికి సంతాపం తెలిపారు. అనంతరం జరిగిన సభలో మేనేజింగ్ కమిటీ సభ్యులంతా ఏకగ్రీవంగా పీఈఎస్ యూనివర్శిటీ చాన్స్‌లర్ హోదాకు ప్రొఫెసర్ జవహర్ దొరస్వామి పేరును ఖరారు చేశారు. ప్రస్తుతం జవహర్ ప్రొ చాన్స్‌లర్‌గా వ్యవహరిస్తున్నారు. జవహర్ దొరస్వామి బెంగళూరు యూనివర్శిటీ నుంచి ఇంజనీరింగ్ పూర్తి చేశారు. మాస్టర్ ఆఫ్ సైన్స్‌ను అమెరికాలో టెక్సాస్ ఎ అండ్ ఎం యూనివర్శిటీలో పూర్తి చేశారు. గుణాత్మకమైన విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలనే లక్ష్యంతో జవహర్ వ్యవహరిస్తున్నారు. పీఈఎస్ యూనివర్శిటీకి అనుబంధమైన ఇంజనీరింగ్ కళాశాలలు అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు జవహర్ చూపుతున్న చొరవ ప్రధాన కారణంగా ఉంది. దాదాపు రెండు దశాబ్దాలకు పైగా జవహర్ అధ్యాపకుడిగానే కాకుండా విద్యార్థుల నైపుణ్యాత పెంపుకుగాను ప్రత్యేక కోర్సులు విధానాలు తీసుకువచ్చారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.47 (శుక్రవారం సాయంత్రం)

సెహరీ : 5.12 (శనివారం ఉదయం)

వందే భారత్!


బెంగళూరు-కలబురగి వందే భారత్ రైలు

- రైలుకు జై కొడుతున్న ప్రయాణికులు
- సేవలపై సంతృప్తి
- టిక్కెట్టు ధరలు కాస్త ఎక్కువ అంటున్న పలువురు



గుంతకల్లు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): వందే భారత్ రైలుకు జనం జై కొడుతున్నారు. రైలులో ప్రయాణం, సేవలు అద్భుతమని పేర్కొంటున్నారు. టిక్కెట్టు ధరలే కాస్త ఎక్కువ అంటూ పలువురు పేర్కొంటున్నారు. అయినా, సేవలు ఆ స్థాయిలోనే అందుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కలబురగి-బెంగళూరు-కలబురగి వందేభారత్ రైలు (నం.22231/32) ఎక్స్‌ప్రెస్ ప్రారంభమై ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా వందేభారత్ రైలు ప్రయాణికులను 'ఆంధ్రజ్యోతి' స్థానిక రైల్వే స్టేషన్‌లో పలకరించింది. వారి అనుభవాలను అడిగి తెలుసుకుంది. టిక్కెట్టు ధరతో ముడిపెట్టకుండా చూస్తే వందేభారత్ రైలు సేవలు అత్యుత్తమంగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తంచేశారు. పగటివేళ తిరిగే ఈ రైలు వల్ల ప్రయాణ బడలిక లేకుండా గమ్యస్థానాలకు చేరుకుంటున్నామని ప్రయాణికులు తెలియజేస్తున్నారు. రిజర్వేషన్ విధానం వల్ల వందలాది సీట్లు ఖాళీగా ఉన్నా, చివరి నిమిషంలో ఈ రైల్లో ప్రయాణించడానికి వీలులేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి రైల్వే శాఖ చొరవ చూపాలని విజ్ఞప్తులు చేస్తున్నారు.

రెండో తరం రైలు

వందేభారత్ రైళ్లలో రెండో తరం రైలును బెంగళూరు-కలబురగి (గుల్బర్గా) మధ్య గత సంవత్సరం మార్చి 12వ తేదీన ప్రారంభ రన్ నిర్వహించారు. ఇది వందేభారత్ రైళ్లలో 26వది. కలబురగి-బెంగళూరు మధ్య 548 కి.మీ.ల దూరాన్ని 8 గంటలా 45 నిమిషాల వ్యవధిలో చేరుకునేలా సమయాలను నిర్ణయించారు. ఈ రైలు కలబురగిలో ఉదయం 5.15కి బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు బెంగళూరుకు చేరుకుంటుంది. గంటకు 63 కి.మీ.ల సగటు, 130 కి.మీ.ల గరిష్ఠం వేగంతో ప్రయాణిస్తోంది. కేవలం ఆరు స్టాపింగ్‌లు ఉంటాయి. కలబురగిలో బయలుదేరే ఈ రైలును యాద్గిర్, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, గుంతకల్లు, అనంతపురం, యల్హంక స్టేషన్లలో మాత్రమే నిలుపుతున్నారు. శుక్రవారం మినహా వారంలో ఆరు రోజులు ఈ రైలును నడుపుతున్నారు.

సేవలు అద్భుతం



వ్యాపార నిమిత్తం బెంగళూరుకు వందే భారత్ రైలులో వెళ్తుంటా. టిక్కెట్టు రేటు ఎక్కువైనా అందులో సేవలు అద్భుతంగా ఉన్నాయి. విమానాల్లో మాదిరిగానే వేళకు టీ, టిఫిన్, భోజనం అందిస్తున్నారు. ఆహారం బాగా ఉంటోంది. పరిశుభ్రత పాటిస్తున్నారు. కుదుపుల్లేని ప్రయాణం, సకాలంలో గమ్యస్థానానికి చేర్చడం నచ్చింది. టిక్కెట్టు రేట్లు ఎక్కువగా ఉన్నాయని చింతించాల్సిన అవసరం లేదు. డబ్బుకు తగిన సేవలు అందిస్తున్నారు.

-సంజయ్ జీరావాలా, వ్యాపారి, గుంతకల్లు

పగటిపూట అనుకూలం

ఎక్స్‌ప్రెస్ రైళ్లలో పగటి వేళల్లో ప్రణించడానికి కూడా బెర్త్‌ను రిజర్వు చేయాల్సి ఉంటుంది. రిజర్వేషన్ చేసినా పగటి వేళ కింద, మధ్య బెర్తుల ప్రయాణికులు పడుకోవడానికి వీలుండదు. కనుక సాధారణంగా పగటి వేళల్లో ప్రయాణికులు కూర్చునే ప్రయాణిస్తారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పగటి వేళలో బయలుదేరి, సాయంత్రంలోపు గమ్యస్థానానికి చేరుకునేలా వందేభారత్ రైళ్లను రూపొందించారు. ఈ రైళ్లల్లో బెర్తులు ఉండవు. (త్వరలో బెర్తులు కలిగిన వందేభారత్ రైళ్లను ప్రవేశ పెట్టనున్నారు). బస్సుల్లో మాదిరి కూర్చుని ప్రయాణించడానికి వీలుగా రెండు రకాల టిక్కెట్లను జారీ చేస్తున్నారు. ఎగ్జిక్యూటివ్, ఎకానమీ చైర్ అనే రెండు స్థాయిల కార్ సిస్టం ఈ వందే భారత్ రైలులో ఉంది. ఎగ్జిక్యూటివ్ చైర్ ధర ఎకానమీ కంటే చాలా ఎక్కువగా ఉంటుంది. విమానాల మాదిరిగా టిక్కెట్ బుకింగ్ సమయంలోనే ఆహారాన్ని ఆర్డర్ ఇచ్చేలా ఆన్‌లైన్ యాప్‌ను రూపొందించారు. రేటు ఎక్కువగా ఉన్నా దానికి తగినంత సేవలు అందిస్తున్నారని ప్రయాణికులు చెబుతున్నారు. మరి కొందరు ధర ఎక్కువని ఆర్థిక ఇబ్బందిని వ్యక్తం చేస్తున్నారు. బస్సు కంటే ఎంతో మెరుగ్గా ప్రయాణం సాగుతోందని ప్రయాణికులందరూ ఏకగ్రీవంగా అభిప్రాయపడుతున్నారు.

టిక్కెట్టు సమస్య

సాధారణ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ప్రయాణికుల డిమాండ్ ఎక్కువగా ఉన్నపుడు బెర్తులు ఖాళీగా ఉండవు. ఒకవేళ చివరి నిమిషంలో ప్రయాణికులు టిక్కెట్టు రద్దు చేసుకున్నా ఖాళీగా ఉండే ఆ బెర్తును టీటీఈ వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికులకు కేటాయించే అవకాశం ఉంది. ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన వందే భారత్ రైళ్లలో వెయిటింగ్ లిస్టు టిక్కెట్లను జారీ చేయడం ఉండదు. రైల్వే స్టేషన్‌కు 40 కి.మీ.ల దూరంలో వందే భారత్ రైలు వచ్చేసిందంటే కరంట్ చార్ట్ ప్రిపరేషన్ జరుగుతుంది. చార్ట్ సిద్ధమైన తర్వాత టిక్కెట్టును పొందలేరు. రైల్వే స్టేషన్‌కు వచ్చి, వందే భారత్ రైలులో సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిసినా అప్పటికప్పుడు టిక్కెట్టు కొనలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. దీనికి పరిష్కారం చూపుతూ.. సీట్లు ఖాళీగా ఉంటే రైలు వచ్చే ఐదు నిముషాల ముందు కూడా టిక్కెట్లను జారీచేసేలా రైల్వే శాఖ కృషిచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

టిక్కెట్ల ధరలు తడిసి మోపెడు..



వందే భారత్ రైళ్లలో ఎకానమీ టిక్కెట్ల ధరలు ఎక్స్‌ప్రెస్ రైళ్లలోని ఏసీ-2 టైర్ రేంజ్‌లో ఉంటాయి. ఇక ఎగ్జిక్యూటివ్ చైర్ టిక్కెట్టు రేట్లు ఏకంగా విమానపు చార్జీని తలపిస్తాయి. కలబురగి నుంచి బెంగళూరుకు వెళ్లాలంటే వందే భారత్ రైల్లో ఎకానమీ టిక్కెట్టు ధర రూ.1,700, ఎగ్జిక్యూటివ్ అయితే రూ.2,700. ఈ రేట్ల కారణంగా 25 శాతం సీట్లు ఖాళీగా ఉంటున్నాయి.

- ప్రశాంత్, చార్టెడ్ అకౌంటెంట్, కలబురగి

రైలు వచ్చే ముందు టిక్కెట్లివ్వాలి



వందే భారత్ రైలుకు సాధారణంగా ఆన్‌లైన్‌లోనే టిక్కెట్టు బుక్ చేసుకుంటుంటారు. అధిక టిక్కెట్టు ధరల కారణంగా చాలా సీట్లు ఖాళీగా ఉంటున్నాయి. రైలు వచ్చే ముందు టిక్కెట్టు కొందామనుకున్నా సాధ్యపడదు. ఈ రైలులో వెయిటింగ్ లిస్టు ప్రయాణికులకు ప్రవేశం లేనందున సీట్లు ఖాళీగా మిగిలిపోతున్నాయి. రైల్వేకి కూడా ఇది నష్టం. చివరి నిమిషంలో టిక్కెట్టు కొని ఈ రైలులో ప్రయాణించే అవకాశం కల్పించాలి.

- రవితేజ, సాఫ్ట్‌వేర్ ఇంజనీరు, బెళుగుప్ప

తూతూమంత్రంగా బదిలీలు

సిఫారసు లేఖలు తూచ్..

హెల్త్ గ్రౌండ్, దివ్యాంగ, స్పౌజ్ రిక్వెస్టులకు నో చాన్స్

వివాదాస్పదంగా పామిడి, గుత్తి ఏపీఓల నియామకం


బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఆర్వో, డ్వామా పీడీ

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): డ్వామాలో బదిలీలు తూతూమంత్రంగా సాగాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనలు తుంగలో తొక్కి సొంత ప్రణాళికలను డ్వామా అధికారులు అమలు చేశారు. డ్వామాలో కీలకంగా ఉండే హెచ్‌ఆర్, మరో ద్వితీయ ఉన్నతాధికారి ఉద్యోగుల బదిలీల్లో కీలకంగా వ్యవహరించారు. గురువారం స్థానిక డ్వామా హాల్‌లో డీఆర్వో మలోల, పీడీ సలీంబాషా ఆధ్వర్యంలో ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ చేపట్టారు. సీనియార్టీ ప్రకారం బదిలీలు చేపట్టాలని నిర్ణయించారు. ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు, హెల్త్ గ్రౌండ్, దివ్యాంగులు, స్పౌజ్ రిక్వెస్టులు పరిగణనలోకి తీసుకోలేదనే వాదన వినిపిస్తోంది. పామిడి, గుత్తి ఏపీఓల బదిలీ వివాదాస్పదంగా మారింది.

వినతులు తూచ్..

డ్వామా బదిలీల్లో అనేక వింతలు కనిపిస్తున్నాయి. రిక్వెస్ట్, హెల్త్‌గ్రౌండ్, స్పౌజ్, దివ్యాంగుల వినతులను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. వాటిని పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. గుత్తి, పామిడి ఏపీఓల బదిలీలు వివాదాస్పదంగా మారాయి. యాడికిలో ఉన్న ఏపీఓ రమేష్‌ను గుత్తికి బదిలీ చేశారు. గుత్తిలో ఉన్న మద్దిలేటిని యాడికికి బదిలీ చేశారు. కూడేరు ఏపీఓ తులసిప్రసాద్‌ను పామిడికి పంపారు. పీడీ కార్యాలయంలో ఉన్న ఆదినారాయణమ్మ తాడిపత్రిలో డెప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. ఆదినారాయణమ్మను పామిడికి బదిలీ చేస్తున్నామనీ, ఇదివరకు పామిడికి బదిలీ చేసిన తులసిప్రసాద్‌ను గుత్తికి మార్చామని డ్వామా అధికారులు చెప్పడంతో పలువురు ఏపీఓలు వాగ్వాదానికి దిగారు. పామిడి ఎంపీడీఓ... ఏపీఓగా ఆదినారాయణమ్మ వస్తేనే విధుల్లో చేర్చుకుంటాననీ, వేరే వాళ్లు వస్తే వెనక్కు వెళ్లాల్సిందేనని హుకుం జారీ చేసినట్లు తెలిసింది. గుమ్మఘట్ట ఏపీఓగా పనిచేస్తున్న సురేష్‌కుమార్ నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నా.. తిరిగి అదే స్థానంలో పోస్టింగ్ ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది. అదే క్లస్టర్‌లో పనిచేస్తున్న నలుగురు టెక్నికల్ అసిస్టెంట్లకు ఐదేళ్లు పూర్తయినా తిరిగి అదే క్లస్టర్‌లో నియమించడం వల్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక డ్వామా పీడీ కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు ఐదేళ్లు పూర్తయినా వారిని కదిలించకపోవడం గమనార్హం. హెచ్‌ఆర్ మేనేజర్ సర్వీస్ ఆరేళ్లు కావస్తున్నా అక్కడే ఉంచడం వల్ల ఉద్యోగుల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. బుక్కరాయసముద్రంలో ఉన్న ఏపీఓ పోలేరయ్యను కూడేరుకు, ఉరవకొండ ఏపీఓ విమలను గుంతకల్లుకు, పుట్లూరు ఏపీఓ చెన్నకేశవయ్యను ఆత్మకూరుకు, పెద్దవడుగూరులో ఉన్న ఏపీఓ పుల్లారెడ్డికి తిరిగి అక్కడికే పోస్టింగ్ ఇచ్చారు. ఏడాదిగా వివిధ ఆరోపణలు ఎదుర్కొంటూ పీడీ కార్యాలయంలో కూర్చుని జీతం తీసుకుంటున్న ఏపీఓలు ఓబిరెడ్డి, విజయభారతిని ఎక్కడా బదిలీ చేయలేదు. అనంతపురం రూరల్ ఏపీఓగా ఉన్న చంద్రకళను తాడిపత్రికి బదిలీ చేశారు.

175 మందికి కౌన్సెలింగ్

డ్వామాలో 175 మంది ఉద్యోగులకు బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. వీరిలో 11 మంది ఏపీఓలు, 98మంది టీఏలు, 51మంది కంప్యూటర్ ఆపరేటర్లు, 15మంది ఈసీలు ఆన్‌లైన్‌లో బదిలీ కోసం ఆప్షన్ ఇచ్చారు. ఏడుగురు ఏపీఓలు, 98 మంది టీఏలు, 51 మంది కంప్యూటర్ ఆపరేటర్లు, 15మంది ఈసీలను బదిలీ చేశారు. వీటిలో తిరిగి మార్పులు చేర్పులు చేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

చెరువుకు నీరు.. చేనుకు నారు..

నిండిన బండమీదపల్లి చెరువు

- వ్యవసాయ బోర్లలో పెరిగిన నీరు
- విస్తారంగా పంటల సాగు అన్నదాతల ఆనందం
- వైసీపీ పాలనలో ఐదేళ్లూ అరకొరగా నీరు


నీటితో కళకళలాడుతున్న బండమీదపల్లి చెరువు

రాప్తాడు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండమీదపల్లి చెరువుకు ఐదేళ్ల తరువాత జలకళ వచ్చింది. ఊరికి పండగొచ్చింది. హంద్రీనీవా నీటితో చెరువును పూర్తిగా నింపడంతో భూగర్భ జలమట్టం పెరిగింది. వ్యవసాయ బోర్లలో నీరు వస్తోంది. దీంతో రైతులు పంటల సాగుకు ఉపక్రమించారు. విస్తారంగా వరి, వేరుశనగ పంటలు సాగు చేస్తున్నారు. చెరువు కింద వందల ఎకరాల్లో పచ్చదనం పరుచుకుంది. టీడీపీ హయాంలో కాలువ తవ్వి, చెరువుకు నీరు వదిలారు. అప్పట్లో చెరువును పూర్తిగా నింపారు. వైసీపీ అధికారం చేపట్టాక పూర్తిగా నిర్లక్ష్యం చూపారు. ఐదేళ్లలో ఒక్కసారి కూడా చెరువును పూర్తిస్థాయిలో నింపలేదు. అరకొరగా నీరు వదిలి, మమ అనిపించేవారు. ఆ నీరు చెరువు గుంతల్లోకి కూడా చాలేది కాదు. దీంతో భూగర్భ జలమట్టాలు తగ్గిపోయి, చాలా బోర్లలో నీరు రాకుండా పోయింది. రైతులు చేసేదిలేక పంటల సాగు ఆపేశారు. గతేడాది కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో మళ్లీ చెరువుకు జలకళ వచ్చింది. ఈ ఏడాది చెరువును పూర్తిస్థాయిలో నింపడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాగు, తాగునీటికి ఇబ్బందులు లేకుండా పోయాయి.



గతేడాది చెరువులో నీరు లేకపోవడంపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం


సాగు చేసిన వరి

రూ.కోట్లు ఖర్చు పెట్టి.. కాలువ తవ్వి..

టీడీపీ హయాంలో పరిటాల సునీత మంత్రిగా ఉన్నపుడు కనగానపల్లి మండలం కోనాపురం సమీపంలోని హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి బండమీదపల్లి చెరువుకు నీరు సరఫరా చేసేందుకు దాదాపు రూ.8కోట్లు ఖర్చు చేసి పిల్ల కాలువ తవ్వారు. తద్వారా ఏటా చెరువు నింపి, మరువ పారించారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక చెరువుకు నీటి విడుదలపై నిర్లక్ష్యం చూపారు. ఐదేళ్లలో ఒక్కసారి కూడా చెరువును నింపలేదు. దీంతో వ్యవసాయ బోరుబావులు వట్టిపోయి, పొలాలను రైతులు బీడుగా వదిలేయాల్సి వచ్చింది. తాగునీటికీ ఇబ్బందులు తలెత్తాయి. పాడి పెంపకానికి సైతం అన్నదాతలు అవస్థలు పడ్డారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో చెరువుకు పూర్తిస్థాయిలో నీరు సరఫరా చేశారు. దీంతో చెరువు నిండి, కళకళలాడుతోంది. చెరువులో నీరు సమృద్ధిగా ఉండటంతో దూరప్రాంతాల్లోని రైతుల పొలాల్లో కూడా భూగర్భ జలాలు పెరిగి విరివిగా పంటలు సాగు చేశారు.

ఎమ్మెల్యే చొరవతోనే చెరువుకు నీరు



టీడీపీ హయాంలో పరిటాల సునీత మంత్రిగా ఉన్నపుడు బండమీదపల్లి చెరువుకు నీరు సరఫరా చేసేందుకు దాదాపు రూ.8కోట్లు ఖర్చు చేసి పిల్ల కాలువ తవ్వారు. ఏటా చెరువు నింపి, మరువ పారించారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చెరువుకు నీరు సక్రమంగా సరఫరా చేయకపోవడంతో గ్రామంలో రైతులు, ప్రజలు.. సాగు, తాగు నీటికి ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వం మారింది. ఎమ్మెల్యే పరిటాల సునీత చొరవతో చెరువుకు పూర్తిస్థాయిలో నీరు సరఫరా చేశారు.

-శ్రీనివాసులు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి, బండమీదపల్లి

పుష్కలంగా నీరు



గతేడాది చెరువులో నీరు అరకొరగా ఉండడంతో వ్యవసాయ బోరుబావుల్లో భూగర్భ జలాలు తగ్గి, రైతులు పంటల సాగుకు ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం చెరువు నిండా నీరు ఉండటంతో వ్యవసాయ బోరుబావుల్లో నీరు పుష్కలంగా వస్తోంది. రైతులు విరివిగా పంటలు సాగు చేసుకుంటున్నారు.

- ప్రసాద్, రైతు, బండమీదపల్లి

ఉద్యోగాల కల్పన తరువు..!


థర్మల్ ఇంజనీరింగ్ ల్యాబ్‌లో శిక్షణ ఇస్తున్న అధ్యాపకుడు

- పాలిటెక్నిక్ కోర్సులతో మెండుగా అవకాశాలు
- పెరుగుతున్న డిమాండ్
- ఉమ్మడి జిల్లాలో 11 కళాశాలలు
- తొమ్మిది కోర్సులు.. 2,123 సీట్లు..
- ఏప్రిల్ 15వరకు దరఖాస్తులు

అనంతపురం సెంట్రల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సులు ఉద్యోగాలకు కేరాఫ్‌గా నిలుస్తున్నాయి. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరి సులువుగా ఉద్యోగాలు సాధిస్తున్నారు. గత ఎనిమిది నెలల్లోనే అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 803 మంది ఉద్యోగాలకు ఎంపిక య్యారు. నూతన ప్రభుత్వం ఏర్పాటుతో కంపెనీల్లో సానుకూల వాతావరణం ఏర్పడింది. ఈ నేపథ్యంలో పాలిటెక్నిక్ కోర్సులకు డిమాండ్ పెరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో 11 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి. వాటిలో తొమ్మిది ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులకు 2,123 మంది విద్యార్థులకు కన్వీనర్ కోటా కింద ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఇందుకు రాష్ట్ర సాంకేతిక విద్య శిక్షణా మండలి ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కామన్ ప్రవేశ పరీక్ష (పాలిసెట్) నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. పదో తరగతి పరీక్షలు రాస్తూనే పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏప్రిల్ 30న పరీక్ష ఉంటుంది.

రాయలసీమకే తలమానికం

రాయలసీమలోనే ఎక్కడాలేని వర్క్‌షాప్, ల్యాబ్‌లు అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సొంతం. ఎలక్ట్రికల్ ల్యాబ్, మెకానిక్ షాప్, మెటీరియల్ టెస్టింగ్, స్మితి.. షీట్ మెటల్, ఆటోమొబైల్ ల్యాబ్, థర్మల్ ఇంజనీరింగ్ ఫ్యూయల్ ల్యాబ్, ఎలక్ట్రికల్ వైరింగ్, సాయిల్ మెకానిక్, ఫిట్టింగ్ సెక్షన్, ఫోర్, టూవీలర్ మెకానిక్ తదితర ల్యాబ్‌లున్నాయి. సీమెన్స్ ట్రైనింగ్ సెంటర్ టెక్నికల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూషన్, ఆటోమొబైల్ ఇండస్ట్రీ బేసిక్ టెక్నికల్ కోర్సుల శిక్షణా కేంద్రాలున్నాయి. సాఫ్ట్ స్కిల్స్‌కు సంబంధించిన కంప్యూటర్ ల్యాబ్, ఎలక్ట్రానిక్ సర్క్యూట్, డిజిటల్ మైక్రో, కమ్యూనికేషన్ మైక్రోవేవ్, కంప్యూటర్ హార్డ్‌వేర్ వంటి ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. మూడేళ్ల పాలిటెక్నిక్ కోర్సుల కాలంలో 70 శాతం సమయం ఈ వర్క్‌షాప్, ల్యాబుల్లోనే విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ ఇస్తారు. ఫలితంగా చివరి సంవత్సరంలోనే ఉద్యోగాలకు ఎంపికవుతున్నారు.

9 కోర్సులు, 2123 సీట్లు...

ఉమ్మడి జిల్లాలోని 11 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో తొమ్మిది రకాల ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులు అందిస్తున్నారు. ఏఐ, ఎంఎల్, ఆటోమొబైల్, సివిల్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఈఈఈ, ఈవీ, ఈసీఈ, మెకానికల్, టెక్స్‌టైల్ టెక్నాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో మొత్తం 2,123 సీట్లు ఉన్నాయి. వాటిలో విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు.


కళాశాలలోని వర్క్‌షాప్, ల్యాబ్స్

8 నెలల్లోనే 800 ఉద్యోగాలు..

రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటుతో ఉద్యోగావకాశాలు ఊపందుకున్నాయి. ఆధికారుల సమాచారం మేరకు గత ఐదేళ్లలో పాలిటెక్నిక్ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు 2020-24 మార్చి వరకు 224 మందికి ఉద్యోగాలు వచ్చాయి. 2024 జూలై నుంచి 2025 ఫిబ్రవరి వరకు 803 మంది ఉద్యోగాలు సాధించారు. కంపెనీల్లో సానుకూల పరిస్థితులు నెలకొనడాయనడానికి ఇది నిదర్శనం. ప్రముఖ కంపెనీలు.. పాలిటెక్నిక్ విద్యార్థులను ఉద్యోగాల్లో నియమించుకుంటున్నాయి.


స్మితి ల్యాబ్‌లో ప్రాక్టికల్స్ చేస్తున్న విద్యార్థులు


అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

సులువుగా ఉద్యోగాలు



పాలిటెక్నిక్ కోర్సులతో ఉద్యోగాలు సులువుగా పొందవచ్చు. మూడేళ్ల కోర్సు వ్యవధిలోనే ఉద్యోగం సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతాం. ఆ దిశగా ప్రముఖ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నాం. ఫలితంగా గత ఎనిమిది నెలల్లోనే 800 మందికి పైగా ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

- జయచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్, అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

మగాడ్రా బుజ్జీ..!

సస్పెన్షన్ అయిన చోటికే పోస్టింగ్.. కణేకల్లు మోడల్ స్కూల్‌లో విడ్డూరం


మోడల్ స్కూల్

రాయదుర్గం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో పైరవీలు శృతిమించాయి. పై అధికారుల చేతులు తడిపితే చాలు.. అనుకున్నది సాధించుకోవచ్చని ప్రచారం జరుగుతోంది. నిబంధనలను ఖాతరు చేయకుండా పోస్టింగ్‌లు ఇవ్వడం ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. సస్పెండ్ అయిన వారికి తిరిగి అదే స్థానాన్ని కేటాయించకూడదు. కానీ అక్కడే రీ పోస్టింగ్ ఇచ్చారు. విచారణ పెండింగ్‌లో ఉన్న సమయంలో ఇలా చేస్తే.. రికార్డులను తారుమారు చేసే ప్రమాదం ఉంది. తమకు అనుకూలంగా వ్యవహారాన్ని చక్కదిద్దుకునే వీలుంది. కణేకల్లు మోడల్ స్కూల్‌లో సివిక్స్ అధ్యాపకుడు ఆదినారాయణప్పను జూలై 2024లో సస్పెండ్ చేశారు. ఎనిమిది నెలల అనంతరం సస్పెన్షన్‌ను ఎత్తివేసి, అక్కడికే పోస్టింగ్ ఇచ్చారు. ఆదినారాయణప్ప అప్పట్లో విధులకు సక్రమంగా హాజరు కాలేదనే ఆరోపణలు వచ్చాయి. దీనికి తోడు దొంగ సంతకాలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అప్పటి పరిస్థితిపై గత ఏడాది జూలై 11న ఆంధ్రజ్యోతిలో 'పెద్ద సారూ యాడున్నాడో..' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఉన్నతాధికారులు, తనిఖీలు నిర్వహించారు. ఆయన వ్యవహారాలపై సమగ్ర నివేదికను పై అధికారులకు సమర్పించారు. ఆ నివేదిక ఆధారంగా ఆదినారాయణప్పై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటూ సస్పెండ్ చేశారు. రెండురోజుల క్రితం సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ ఆర్జేడీ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. సాధారణంగా సస్పెన్షన్ ఎత్తివేసిన సమయంలో వేరే ప్రాంతానికి పోస్టింగ్ ఇవ్వాలనే నిబంధన ఉంది. దీన్ని ఏమాత్రం పాటించలేదు. మోడల్ స్కూల్‌లో సస్పెన్షన్‌కు ముందు ఉన్న రికార్డులను తారుమారు చేస్తే పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. సస్పెన్షన్ ఎత్తివేత ఉత్తర్వుల్లో విచారణ పెండింగ్‌లో ఉన్న విషయాన్ని పొందుపరిచారు. ఇలాంటి సమయంలో అక్కడే పోస్టింగ్ ఇవ్వడంపై ఉపాధ్యాయ వర్గాలు విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నాయి.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

ఎంఆర్ అప్పారావు (జయంతి)



ఎంఆర్ అప్పారావుగా పేరొందిన నూజివీడు జమీందారీ కుటుంబానికి చెందిన ఈయన పూర్తిపేరు మేకా రంగయ్య అప్పారావు విద్యావేత్త, మాజీ మంత్రి. 1915 మార్చి 21న కృష్ణాజిల్లా నూజివీడు గ్రామంలో జన్మించారు. నూజివీడు నియోజకవర్గం నుంచి వరుసగా ఐదుసార్లు కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందారు. నీలం సంజీవరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో సేవలందించారు. ఆ తర్వాత రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1989లో ఒకసారి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి చేతిలో ఓటమి చెందారు. టెన్నిస్ క్రీడాకారుడిగాను రాణించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా వ్యవహరించారు. 2003 జనవరి 31న పరమపదించారు.

ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ (జయంతి)



షెహనాయ్ వాద్యాన్ని సాంప్రదాయ వేడుకలు, ఉత్సవాల నుంచి కచేరి స్థాయికి తీసుకెళ్లిన ఘనత 'భారతరత్న' గ్రహీత ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ సాహెబ్ 1916 మార్చి 21న బిహార్ రాష్ట్రం డుమ్రావ్ పట్టణంలో జన్మించారు. ఎంఎస్ సుబ్బలక్ష్మి, రవిశంకర్‌ల తర్వాత సాంప్రదాయ సంగీత విద్వాంసులలో 'భారతరత్న' పొందిన మూడోవ్యక్తి బిస్మిల్లాఖాన్. 'నేను మహమ్మదీయుడైనను సరస్వతీదేవి ఆరాధకుడను, ఆమెను తలవనిదే నారోజు ఆరంభం కాదు. సంగీతానికి భాషా భేదాలు లేవు, నా దేశ ప్రజలు తమ ఇంటి సభ్యుడిగా ఆదరించారని' చెప్పిన మహాదేశభక్తుడు. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ సహా సంగీత నాటక అకాడమీ అవార్డు ఇతర గౌరవాలు అందుకున్నారు. 2006 ఆగస్టు 21న కన్నుమూశారు. వారణాసిలో సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

మాతా నిర్మలాదేవి (జయంతి)



శ్రీ మాతాజీ నిర్మలాదేవి 1923 మార్చి 21న మధ్యప్రదేశ్ రాష్ట్రం చింద్వారా ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు నిర్మలా శ్రీవాత్సవ. ధార్మిక ఉద్యమంలో పేరొందిన సహజ యోగ్ సంస్థాపకురాలు. క్రమం తప్పని ధ్యానం, యోగాల ద్వారా చక్కటి ఆరోగ్యం సాధ్యమని ఆచరించి చూపారు. ప్రజలను ఎంతో చైతన్యం చేశారు. ఢిల్లీలో విశ్వనిర్మల ప్రేమ ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. నాగపూర్‌లో ఒక సంగీత పాఠశాలను ఏర్పాటు చేశారు. చైనా దేశం తరఫున ఐక్యరాజ్యసమితి మహిళా సదస్సులో ప్రసంగించారు. పలు గౌరవాలు అందుకున్నారు. 2011 ఫిబ్రవరి 23న కన్నుమూశారు.

నటరాజ రామకృష్ణ (జయంతి)



నటరాజ్ రామకృష్ణ 1933 మార్చి 21న ఇండోనేషియా దేశం బాలి ప్రాంతంలో జన్మించారు. తల్లిదండ్రులు నల్గొండ జిల్లా, తూర్పు గోదావరి జిల్లాలకు చెందినవారు. కూచిపూడి నాట్య కళాకారుడు. ఆంధ్రనాట్యము, పేరిణి తాండవము, నవజనార్దనం వంటి ప్రాచీన నాట్యరీతుల్ని తిరిగి వెలుగులోకి తెచ్చారు. కళలను పోషించేందుకు ఆజన్మబ్రహ్మచారిగానే ఉండిపోయారు. 18వ యేట నాగపూర్‌లో ఆయనకు నటరాజ్ బిరుదును ప్రదానం చేశారు. పద్మశ్రీ, కళాప్రపూర్ణ తదితర గౌరవాలు అందుకున్నారు. 2011 జూన్ 7న కన్నుమూశారు.

సుధారాణి రఘుపతి (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత సుధారాణి రఘుపతి 1944 మార్చి 21న తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు జిల్లా పొల్లాచ్చి ప్రాంతంలో జన్మించారు. భరతనాట్య కళాకారిణిగా రాణించారు. అమెరికా దేశం వర్జీనియాలోని రాండల్ఫ్ మాకన్స్ ఉమెన్స్ కళాశాల నుంచి సోషియాలజీ అండ్ ఫిలాసఫీలో 1964-65లో తొలి ఇండియన్ గ్రాడ్యుయేట్ కావడం విశేషం. భరతనాట్యంపై రచనలు కూడా చేశారు. ఐక్యరాజ్యసమితి తరఫున 1981లో వరల్డ్ హ్యూమన్ రైట్స్ డే వేదికపై నృత్య ప్రదర్శన చేసి ఆకట్టుకున్నారు. ఇన్‌స్టిట్యూట్ ద్వారా మూడు దశాబ్దాలుగా నృత్యంలో శిక్షణ ఇస్తున్నారు. సంగీత నాటక అకాడమీ, కలైమామణి, సప్తగిరి సంగీత విద్వన్మణి తదితర అవార్డులు పొందారు.

శోభన (పుట్టినరోజు)



నాట్యంలోనూ, నటనలోనూ ప్రసిద్ధి చెందిన ట్రావెన్‌కోర్ సిస్టర్స్ లలిత, పద్మిని, రాగిణిల మేనకోడలైన శోభన 1966 మార్చి 21న తిరువనంతపురంలో జన్మించారు. తొలి సినిమా 'విక్రమ్' (హీరో నాగార్జున) ద్వారా తెలుగుతెరకు పరిచయమయ్యారు. రెండుసార్లు జాతీయ ఉత్తమనటి పురస్కారం అందుకున్నారు. భరతనాట్యంలోనూ ఎంతో ముఖ్యమైన అభినయాన్ని ప్రదర్శించడంలో దిట్ట. చెన్నైలోని కళార్పణ సంస్థ ద్వారా మూడు దశాబ్దాలుగా భరతనాట్యంలో శిక్షణ ఇస్తున్నారు. 2022లో గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.

పావగడ చేరిన తుంగభద్ర నీరు

పావగడ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న తుంగభద్ర నీరు ఎట్టకేలకు గురువారం పావగడ తాలూకా కోటగుడ్డం గ్రామ పంచాయతీ శైలాపురం గ్రామానికి చేరాయి. జిల్లా పంచాయతీ, పావగడ తాగునీటి శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన నీటి తరలింపు పనులు వేగంగా పూర్తయ్యాయి. గురువారం శైలాపురం గ్రామంలోకి ప్రవేశించడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. జేజేఎం పథకం కింద చేపట్టిన పైప్‌లైన్ల ద్వారా తుంగభద్ర నీరు కొళాయిల ద్వారా వదిలారు. ఈ నీరు తాగేందుకు ఎంతో ఉపయోగపడతాయని ఏఈఈ కా వ్య, తాగునీటిశాఖ ఇంజనీర్ బసవలింగప్ప పటేల్ అన్నారు. కార్యక్రమంలో మెగా కంపెనీ అధికారి అశోక్, నవీన్, గ్రామస్థులు పాల్గొన్నారు.

నమో నారసింహా..!



రథోత్సవంలో భక్తుల సందడి

(5వ పేజీ తరువాయి)

బ్రహ్మరథంపై అధిష్ఠింపజేశారు. తిరువీధుల్లో భక్తులు స్వామివారికి దవణం, మిరియాలు, కాయకర్పూరాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

భక్తులను అలరిస్తూ..

కిక్కిరిసిన భక్తుల నడుమ రథం ఉదయం 9. గంటలకు చౌక్ వద్దకు చేరుకుంది. అక్కడ చిన్నమొద్దుల తాళ్లు తెగిపోవడంతో దాదాపు గంటపాటు ఆగిపోయింది. ఆ తర్వాత 10 గంటలకు భక్తుల గోవింద నామస్మరణ నడుమ మహా మంగళహారతి పట్టి.. తిరిగి రథాన్ని ముందుకు కదిలించారు. వెనుకవైపున కుటాగుళ్ళ, మూర్తిపల్లి, గజ్జలరెడ్డిపల్లి తదితర ప్రాంతాల భక్తులు తెడ్లు వేస్తూ.. మొద్దులు తొక్కడంతో రథం వేగంగా ముందుకు కదిలింది. శివాలయం వద్దకు ఉదయం 11.30 గంటలకు రథం చేరుకుంది. అక్కడ వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. గండిబండ అంజనేయస్వామి వద్దకు రథం 12 గంటలకు చేరుకుంది. అక్కడ నుంచి పడమర రాజగోపురం వద్దకు 12.30కు చేరుకుంది. అక్కడ రథంపై శ్రీవారు మరొకసారి పూజలు అందుకున్నారు. స్వామివారి రథం పైకి భక్తాదులు దవణం, మిరియాలు చల్లుతూ స్వామివారిని దర్శించుకుని తన్మయత్వం చెందారు. గొల్ల మంటపం వద్దకు సరిగ్గా మధ్యాహ్నం 12.45 గంటలకు రథం చేరుకుంది. అక్కడ 10 నిమిషాలు గడిపిన అనంతరం 12.50కి రథం ముందుకు కదిలింది. దవణ మండపం వద్ద ఆనవాయితీగా ఆగింది. మంగళ మహాహారతి ఇచ్చిన అనంతరం ఎటువంటి ఆటంకాలు లేకుండా మధ్యాహ్నం 1.40 గంటలకు హిందూపురం క్రాస్ చేరుకుంది. అక్కడ రథం కుడివైపు మోకు తెగిపోవడంతో దాదాపు గంటన్నర పాటు నిలిచిపోయింది. తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు భక్తుల గోవింద నామస్మరణతో రథం ప్రారంభమైంది. యువకులు రెట్టించిన ఉత్సాహంతో రథాన్ని లాగారు. మధ్యాహ్నం 3.56 గంటలకు రథం యథాస్థానానికి చేరుకుంది. రథోత్సవం దాదాపు 7.40 గంటల పాటు కొనసాగింది.

హాజరైన ప్రముఖులు

రథోత్సవానికి ముందు కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, ఆయన సతీమణి కందికుంట యశోదమ్మ పూజల్లో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి తదితరులు రథం పై ఉండి భక్తులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. రథోత్సవంలో ఆర్డీఓ వీవీఎస్ శర్మ, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్, రాయలసీమ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్, ఈఓ వి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. రథోత్సవం ముగిసిన తరువాత రథం వెనుక మొద్దులు తొక్కిన కుటాగుళ్ళ, మూర్తిపల్లి, గజ్జలరెడ్డిపల్లి తదితర ప్రాంతాలకు చెందిన భక్తులకు శ్రీవారి మొదటి దర్శనం కల్పించారు.



రథంపై ఎమ్మెల్యే కందికుంట..

భక్త జనసంద్రం

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవాన్ని వీక్షించడానికి తరలివచ్చిన భక్తులతో కదిరి వీధులన్నీ బుధవారం రాత్రి నుంచే కిక్కిరిశాయి. ఆలయ ప్రాంగణంలో కాలు మోపడానికి కూడా వీలులేకపోయింది. రథంపై కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత నారసింహుడిని దర్శించుకోవడానికి భక్తులు గంటల తరబడి నిరీక్షించారు. నిప్పులు చెరిగే ఎండను సైతం లెక్క చేయకుండా మిద్దెలు ఎక్కారు. రోడ్లపై నిలబడ్డారు. 'నాలుగు గోపురాల వాడా.. గోవిందా.. లక్ష్మీ నారసింహా.. గోవిందా' అంటూ రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. తేరుపై దవణం, మిరియాలు చల్లారు. రథ చక్రాల క్రింద గుమ్మడికాయలు ఉంచారు. రథం పై నుంచి జాలువారిన మిరియాలను ఏరుకునేందుకు ప్రయత్నించారు. తిరుగు ప్రయాణంలో కదిరి కుంకుమ, దవణం, తినుబండారాలు, ఆట వస్తువులు, గృహోపకరణాలు కొనుగోలు చేశారు. తిరువీధులు, పట్టణ ప్రధాన వీధుల్లో దుకాణాలు కిటకిటలాడాయి. యువతీ యువకులు రథోత్సవాన్ని సెల్‌ఫోన్‌లలో బంధించారు. సెల్ఫీలు తీసుకున్నారు. ఉత్సవం ముగిసిన తర్వాత ఆలయంలో శ్రీవారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. పలువురు భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించి, భృగుతీర్థంలో స్నానాలు ఆచరించి, శ్రీవారిని దర్శించుకున్నారు. ప్రసాదాల కొనుగోలు కోసం భక్తులు బారులు తీరారు. చాలా మంది పచ్చబొట్లు వేయించుకోవడానికి బారులు తీరారు.



యువకుల ఉత్సాహం



మిద్దెల పైనుంచి వేడుక చూస్తున్న భక్తులు

పటిష్ఠ బందోబస్తు

రథోత్సవం సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. డీఎస్పీ శివనారాయణ స్వామి ఆధ్వర్యంలో సబ్ డివిజన్ పరిధిలోని సిబ్బంది, పారామిలటరీ సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు. బుధవారం రాత్రి నుంచే వాహనాలను దారి మళ్లించారు. హిందూపురం, బెంగళూరు వైపు బస్సులను కదిరి శివారులోనే నిలిపివేసి, అక్కడే తాత్కాలిక బస్టాప్ ఏర్పాటు చేశారు. క్లాక్ టవర్, కోనేరు, జీవిమాను సర్కిల్, పలిసాట్ రోడ్డులో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. తిరువీధుల్లోకి వాహనాలు ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ఎస్పీ రత్న రథోత్సవంలో పాల్గొన్నారు.

రోగుల సేవల్లో నర్సుల పాత్ర కీలకం

● డాక్టర్ ప్రకాశనాథ స్వామీజీ

బెంగళూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : రోగులసేవలో నర్సుల పాత్ర కీలకమని బీజీఎస్ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశనాథస్వామీజీ అభిప్రాయపడ్డారు. గురువారం బీజీఎస్ జిమ్స్, ఎస్‌జెబీ నర్సింగ్ విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఈసందర్భంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రజాసేవను వృత్తి సేవగా స్వీకరించే నర్సులు రోగుల పాలిట చూపే సేవాభావం ప్రశంసనీయమన్నారు. రోగులకు ఆరోగ్య సలహాలతో పాటు త్వరితగతిన కోలుకునేందుకు వీలుగా నర్సులు చూపే అభిమానం మరువలేనిదన్నారు. నర్సింగ్ విద్యార్థులకు దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు సాధ్యమన్నారు. మీలోని నైపుణ్యత ద్వారా ఎంతోమంది ఆరోగ్యంలో మెరుగు చేసేందుకు దోహదపడాలని పిలుపునిచ్చారు. సిద్ధగంగా మెడికల్ కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సర్వజ్ఞమూర్తి ఆరాధ్య సచ్చిదానంద్ మాట్లాడుతూ నర్సుల పట్టభద్రులకు అపారమైన డిమాండ్ ఉందన్నారు. దేశంలో 35లక్షల మంది నర్సులు ఉన్నారన్నారు. అయినా డిమాండ్ ఉండటం ప్రత్యేకమన్నారు. 210ల మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు పదివేలు చొప్పున, అన్ని సబ్జెక్టులలోను అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు 25వేలు చొప్పున ప్రోత్సాహంగా అందించారు. డాక్టర్ శ్రీకాంత్ కులకర్ణి, ప్రిన్సిపాల్ డాక్టర్ జిజి జాన్సన్, డాక్టర్ రాధికా, డాక్టర్ మోహన్ తదితరులు ఉన్నారు.



అతిథులను సత్కరిస్తున్న ప్రకాశనాథ స్వామీజీ

ఎంజీఎం పాఠశాల హెచ్‌ఎంపై విచారణ

హిందూపురం అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం పాఠశాల హెచ్ఎం సామ్రాజ్యంపై గతంలో కొందరు చేసిన ఫిర్యాదులపై డీవైఈఓ పద్మప్రియ విచారణ అధికారిగా గురువారం పాఠశాలకు వచ్చారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్, విద్యాశాఖ మంత్రి పేషీ నుంచి డీఈఓకు ఆదేశాలు అందగా ఆయన డీవైఈఓకు బాధ్యతలు అప్పగించినట్లు ఆమె తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల అడ్మిషన్లు ఎవరు చేస్తారు? ఆ సమయంలో కమిటీ ఏదైనా వేశారా, 2024-25 సంవత్సరానికి అడ్మిషన్లు జరిగినపుడు విద్యార్థుల నుంచి ఎంత ఫీజు వసూలు చేశారు? పాఠశాలలో చెట్లు తొలగించారా? తొలగిస్తే దానిని ఏ విధంగా తొలగించారు? ఎవరి అనుమతులు తీసుకొని తొలగించారు, వాటిని ఏ విధంగా వినియోగించారు, విద్యా సంవత్సరంలో స్టూడెంట్ కిట్లు అందరికీ అందాయా, అందలేదని ఏ విద్యార్థి నుంచి అయినా ఫిర్యాదులు వచ్చినాయా. అంటూ పలు ప్రశ్నలను పేపర్‌లో రాసి అందులో ఉపాధ్యాయులతో వారి అభిప్రాయాలు సేకరించారు. అదే విధంగా హెచ్ఎం స్టూడెంట్ కిట్లు అమ్ముకున్నారు, చెట్లు నరికించి అమ్ముకున్నారు, టీసీలకు విద్యార్థుల నుంచి డబ్బు వసూలు చేశారని ఫిర్యాదులు అందాయని, వాటిపై కూడా అభిప్రాయాలు తెలియజేయాలని ఆమె ఉపాధ్యాయులకు సూచించారు. దీనిపై ఉపాధ్యాయులు ఎవరికి వారు లిఖితపూర్వకంగా పేపర్‌లో రాసి ఇచ్చారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీవైఈఓ పద్మప్రియ

ఉన్నతాధికారులకు నివేదిస్తాం : పద్మప్రియ, డీవైఈఓ

హెచ్ఎంపై వచ్చిన ఫిర్యాదులపై విచారణకు వచ్చాను. డీఈఓ ఆదేశాలతో ఉపాధ్యాయుల నుంచి వారి అభిప్రాయాలు లిఖిత పూర్వకంగా సేకరించాను. ఆ నివేదికలు ఉన్నతాధికారులకు పంపుతాను.

24 నుంచి యూత్‌ఫెస్ట్ ఇంటరాక్ట్



మీడియాతో మాట్లాడుతున్న ఐశ్వర్య హెగ్డే

బెంగళూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈనెల 24నుంచి కర్ణాటక థీమ్ ఆధారంగా యూత్‌ఫెస్ట్ ఇంటరాక్ట్ 2025 జరుపుతున్నట్లు గ్లోబల్ టెక్ కళాశాల ట్రస్టీ డైరెక్టర్ ఐశ్వర్యాహెగ్డే తెలిపారు. గురువారం కళాశాలలో యూత్‌ఫెస్ట్ ఏర్పాట్ల గురించి మీడియాతో మాట్లాడుతూ మన కళలు, సంస్కృతి, సాహిత్యం, చరిత్ర పరంపరను ప్రతిబింపచేసేలా ఉత్సవాలు ఉంటాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 100 కళాశాలల నుంచి ఇంజనీరింగ్ విద్యార్థులు భాగస్వామ్యులవుతారన్నారు. డీసీఎం డీకే శివకుమార్, వీటీయూ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ విద్యాశంకర్, నటుడు ధ్రువసర్జాలతో పాటు పలువురు ముఖ్యులు పాల్గొంటారన్నారు. 25న విజయ్‌ప్రకాష్ సంగీత కచేరీ ఉంటుందని 27న ముగింపు సమావేశాలలో విజయ్‌రాఘవేంద్ర పాల్గొంటారన్నారు. 1500ల మంది విద్యార్థులతో పాటు కళాశాలల అధ్యాపకులకు వసతితో పాటు సౌలభ్యాలు కల్పించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గోరంట్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రం జాతీయ రహదారి కూడలిలో కారుఢీకొని బాషా అనే వ్యక్తికి గాయాలయ్యాయి. సోమందేపల్లి మండలంలోని స్నేహలతనగర్‌కు చెందిన బాషా పాలసముద్రం క్రాస్‌లోగురువారం రోడ్డు దాటుతుండగా కియ పరిశ్రమకు చెందిన కారు వేగంగా ఢీకొనడంతో ఆ వ్యక్తి గాయపడ్డాడు. అనంతరం కారు ఆపకుండా వెళ్లిపోగా, కొంతమంది యువకులు వెంబడించి కారును సోమందేపల్లి పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. గాయపడిన బాషాను పెనుకొండ ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది.

చిరుత దాడిలో ఐదు మేకల మృతి

పావగడ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): తాలూకా పరిధిలోని కన్న మేడి గ్రామంలో చిరుతపులి దాడి చేయడంతో ఐదు మేకల మృతిచెందిన ఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. మేకల కాపరి హనుమంతరాజు తెలిపిన మేరకు మేకలు కాసుకుంటూ పొలంలో ఉండగా పొదల్లో దాగున్న రెండు చిరుతలు ఒక్కసారిగా మేకలపై దాడి చేయడంతో భయాందోళనకు గురయ్యాయని తెలిపారు. చూస్తున్నట్లుగానే ఐదు మేకలను చంపేశాయన్నారు. అటవీప్రాంతాల్లోకి వెళ్లాలంటేనే భయంగా ఉందన్నారు. ఘటనా స్థ లానికి పశువైద్యాధికారులు పరిశీలించారు. రూ.80వేల వరకు నష్టం వాటిల్లిందని, అటవీశాఖాధికారులు సాయం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరారు.

మద్యం కేసులో ఇద్దరికి జైలు శిక్ష

హిందూపురం/గోరంట్ల, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యం సరఫరా చేస్తూ పట్టుబడిన ఇద్దరికి ఏడాది జైలు శిక్ష, రూ.2 లక్షలు జరిమానా విధిస్తూ పెనుకొండ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి బిజ్జప్ప తీర్పు వెల్లడించారు. ధర్మవరం పట్టణం మారుతీ నగర్‌కు చెందిన శ్రీనాథ్, కదిరి అడపాల వీధికి చెందిన డేవిడ్‌నాథ్ 2020 ఆగస్టు 3న కర్ణాటక నుంచిగోరంట్ల మండలంలోకి అక్రమంగా మద్యం తీసుకువస్తుండగా అప్పటి గోరంట్ల సీఐ జయానాయక్ సిబ్బంది మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. నిందితులను కోర్టుకు హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. విచారణ అనంతరం సాక్షులు చెప్పిన ఆధారాలు రుజువు కావడంతో న్యాయాధికారి జైలు శిక్షవిధించారు. కేసులో ఏపీపీ శ్యామల వాదనలు వినిపించినట్లు గోరంట్ల సీఐ శేఖర్ తెలిపారు.

మూటను మింగేయాలని..!

● పెన్నహోబిలం ఆలయంలో సిబ్బంది కుట్ర ● హుండీలో కానుకల మూటను దాచేసిన వైనం ● పంపకాలలో తేడాతో వెలుగులోకి

ఉరవకొండ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామికి భక్తుడు సమర్పించిన కానుకల మూటను కాజేయాలని చూశారు. హుండీ లెక్కింపులో ఈ మూట కనిపించని విషయం బయటకు పొక్కడంతో బుధవారం రాత్రికి రాత్రే హుండీలోకి ఆ మూటను వేసి.. తమకేమీ తెలియనట్లుగా అధికారులు మౌనంగా ఉండిపోయారు. గత ఏడాది డిసెంబరు 7న ఆమిద్యాలకు చెందిన రంగయ్య, వనజాక్షి దంపతులు మొక్కును తీర్చుకునేందుకు ఆలయానికి వెళ్లారు. అమ్మవారికి బంగారు తాళిబొట్టు గొలుసు, ముక్కుపుడక, కమ్మలు, వెండి పట్టీలు మూటకట్టి హుండీలో వేశారు. వాటి విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని భక్తుడు తెలిపాడు. దేవదాయ శాఖ అధికారులు, సిబ్బంది బుధవారం హుండీ సొమ్మును లెక్కించారు. ఆ సమయంలో కొందరు నగల మూటను దాచినట్లు తెలిసింది. అందులో ఉన్న కానుకల పంపకాలలో తేడా రావడంతోనే వ్యవహారం బయటకు పొక్కింది. విషయం తెలుసుకున్న దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేషునాయుడు గురువారం సాయంత్రం పెన్నహోబిలం చేరుకుని విచారణ చేపట్టారు. బంగారు ఆభరణాలను ఎందుకు లెక్కించలేదని ఈవో రమేష్‌ను భక్తుడు ప్రశ్నించగా, అతని పట్ల ఈవో దురుసుగా ప్రవర్తించారు. ఈ ఘటనపైన సమగ్ర విచారణ జరిపించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.



అర్చకుడితో వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఏసీ

చర్యలు తీసుకుంటాం..

హుండీ లెక్కింపు సమయంలో బంగారు ఆభరణాల మూటను లెక్కించలేదని, దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేషునాయుడు తెలిపారు. హుండీ లెక్కింపు పూర్తి అయిన తర్వాత శుభ్రం చేసే సమయంలో నగల మూట దొరికిందని, వాటిని తిరిగి హుండీలో వేశారని తెలిపారు. నగల మూటను తెరిచి చూశామని, అందులో ముక్కుపుడక కన్పించలేదని అన్నారు. బంగారు ఆభరణాల మూట గురించి ఈవో తనకు సమాచారం ఇవ్వలేదని అన్నారు. ఈ ఘటనపై 15 రోజుల్లో విచారణ పూర్తి చేసి, ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని, బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఆది నుంచి వివాదాస్పదమే

పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఈవో రమేష్ తీరు ఆది నుంచి వివాదాస్పదంగానే ఉంది. 2021లో ఆలయానికి సంబంధించిన నగదును నేరుగా డ్రా చేయడం, రికార్డుల నిర్వహణ లేకపోవడం వంటి 32 అభియోగాలను పరిగణనలోకి తీసుకుని అప్పట్లో సస్పెండ్ చేశారు. సస్పెండ్ అయిన చోటే అతనికి మళ్లీ పోస్టింగ్ ఇవ్వడం విమర్శలకు తావిచ్చింది. రథం నిర్మాణానికి టెండర్లు పూర్తి అయిన తరువాత విరాళాలు సేకరించడంపైనా చర్చ నడుస్తోంది. అన్నదానం విరాళాలు, అద్దెల వసూళ్లు.. రశీదులలో పేర్కొన్న మొత్తానికి పొంతన లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఆలయ అభివృద్ధి పేరు చెప్పి భక్తుల నుంచి విరాళాలు సేకరించారని, వాటికి రశీదులు ఇవ్వలేదన్న ఆరోపణలు ఉన్నాయి. 2022లో గవిమఠంలో పనిచేసే సమయంలో ఓ వైసీపీ నాయకుడి ఆదేశాలతో అతని అనుచరులకు వేలం పాట లేకుండానే భూము లు కట్టబెట్టడం వివాదాస్పదమైంది.

డ్రోన్ల విస్తృతంగా వినియోగించండి : ఎస్పీ

అనంతపురం క్రైం, మార్చి20(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా డ్రోన్లను విస్తృతంగా వినియోగించాలని ఎస్పీ జగదీష్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని పోలీసు అధికారులకు ఎస్పీ పలు ఆదేశాలిచ్చారు. డ్రోన్లతో అసాంఘిక కార్యకలాపాల కట్టడి, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, బందోబస్తు, నమస్యాత్మక గ్రామాల్లో నిఘా కొనసాగించాలన్నారు. వాహన తనిఖీల సమయంలోనూ డ్రోన్లను వినియోగించాలన్నారు. లారీలు, లగేజీ, భారీ వాహనాల్లో ఏమి తరలిస్తున్నారో పసిగట్టాలన్నారు. పేకాట, మట్కా, క్రికెట్ తదితర అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు డ్రోన్లను వాడాలన్నారు. భారీ సభలు, ఆందోళనలు, రథోత్సవాలు, జాతరల సందర్భంగా అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టాలన్నారు. డ్రోన్ల ద్వారా గ్రామాల్లో మిద్దెలపై చట్టవ్యతిరేకంగా ఏదైనా నిల్వ చేసుకున్నా తెలిసిపోతుందనీ, ముందస్తు చర్యలు చేపట్టడానికి వీలుంటుందన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1597.59	1,582.33
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,252	765
నీటి నిల్వ (టీఎంసీలు)	18.57	5.70

ఎస్ఎస్ఎల్సీ పరీక్షలకు ప్రత్యేకాధికారుల నియామకం



కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పదవతరగతి పరీక్ష మార్చి 21నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జిల్లాలోని 64పరీక్షా కేంద్రాల్లో జరుగుతుందని, వివిధ శాఖల అధికారులతో కూడిన అబ్జర్వేషన్ విజిలెన్స్ బృందాన్ని నియమించినట్లు జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడిన ఆయన జిల్లాలోని సంబంధిత తాలూకాల్లోని పరీక్షా కేంద్రాలకు కేటాయించిన అధికారులు పారదర్శకంగా తనిఖీ చేస్తారన్నారు. షెడ్యూల్ ప్రకారం సమీక్షించిన పనులపై నివేదిక సమర్పించాలని కలెక్టర్ విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్‌ను కోరారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా పరీక్షలను ప్రశాంతంగా ముగించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో బళ్లారి వాసి మృతి



కేతప్ప మృతదేహం

కదిరి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా నల్లచెరువు మండలంలోని రాట్నాపల్లి సమీపంలో గురువారం ఉదయం రోడ్డు ప్రమాదంలో కర్ణాటకలోని బళ్లారి వాసి కేతప్ప (60) మరణించాడు. అతను కాలినడకన తిరుమలకు బయలుదేరాడు. నల్లచెరువు మండలంలోని రాట్నాపల్లి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించాడు. ఏఎస్ఐ షేక్షావలీ.. మృతుని బ్యాగును పరిశీలించాడు. అందులోని ఆధార్‌కార్డు ఆధారంగా అతను బళ్లారివాసి కేతప్పగా గుర్తించారు. అందులో ఉన్న ఫోన్ నంబర్‌కు సమాచారం అందించారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అలరించిన సంగీత విభావరి



పాటలు పాడుతున్న కళాకారులు

సిరుగుప్ప, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ద్యామన గౌడ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సంగీత విభావరి కార్యక్రమం ఎంతగానో ఆకట్టుకుంది. సోనియా గాంధీ బైపాస్ రోడ్డులో దివ్యజ్యోతి ఆశ్రమంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాకారులు చిన్నారులు, వృద్ధులను అలరించారు. భక్తిగీతాలు, జానపద గీతాలు, సినీ గీతాలు, భజన పాటలతో పాటు ఆర్కెస్ట్రాపాటలు కూడా వినిపించారు. కళాకారులు చంద్రు, బసవరాజు, సుష్మ, సభ్యులు, సంగీత కళాకారులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

మైనింగ్ నిధులు జిల్లా అభివృద్ధికే ఉపయోగించాలి

● రామ్‌ఘాట్ ఏరియాలో తాగునీటి ఎద్దడిని నివారించాలి ● విధాన పరిషత్‌లో ఎమ్మెల్సీ వైఎం సతీష్ బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సతీష్

బళ్లారి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జిల్లా మేజర్ మినరల్ ఫండ్స్(డీఎంఎఫ్) మైనింగ్ కంపెనీలు స్క్రీనింగ్ చార్జీల పేరుతో వచ్చే నగదు బ్యాంకుల్లో డిపాజిట్ కోసమా..? మైనింగ్ ఎఫెక్టెడ్ ఏరియా అభివద్ధి కోసమా..? అని విధాన పరిషత్ లో బళ్లారి జిల్లా బీజేపీ ఎమ్మెల్సీ వైఎం సతీష్ బాబు గురువారం సభాపతి సమక్షంలో ప్రశ్నించారు. 2024-25 డీఎంఎఫ్ నిధుల వినియోగంలో కేవలం మైనింగ్ ఏరియా పరిధిలో 25 కిలోమీటర్ల ఎఫెక్టెడ్ ఏరియా గ్రామాలకే పరిమితం చేశారన్నారు. అలా జరిగితే డీఎంఎఫ్ నిధులతో సండూరు ప్రాంతంలో ఉన్న రోడ్లన్నీ బంగారు రోడ్డుగా మార్చవచ్చాన్నారు.. ఇక జిల్లాలో ఉన్న రోడ్డు పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. డీఎంఎఫ్ నిధులు జిల్లాలో ఉన్న అన్ని ప్రాంతాల అభివృద్ధికి ఉపయోగించాలని కోరారు. సండూరు ప్రాంతంలోని కొండపై ఉన్న రాంఘాడ్ గ్రామంలో తాగునీటి కొరత తీవ్రంగా ఉందన్నారు. నీరు అడిగితే ఫారెస్టు, మైన్స్ అండ్ జియాలజీ అధికారులు కొండపై నుంచి ఊరు ఖాళీ చేసి కిందకు రమ్మంటున్నారని, కానీ అక్కడే మైనింగ్ కార్యకలాపాలు చేసేందుకు గనుల శాఖ ప్రయత్నం చేస్తోందన్నారు. డీఎంఎఫ్, కేఎంఎఫ్ నిధుల వినియోగంలో గతంలో ఇన్‌చార్జి మంత్రి మానిటర్ కమిటీ అధ్యక్షుడిగా ఉన్నారు. ఇప్పుడు దాని స్థానంలో డీసీని అధ్యక్షుడిగా చేశారు. కేఎంఎఫ్, డీఎంఎఫ్ నిధుల వినియోగంలో కొత్త నిబంధనలు చేసి కమిటీలో సభ్యులను పెంచాలని కోరారు. ఈ సారి జరిగిన వార్షిక బడ్జెట్‌లో బళ్లారి జిల్లాకు ఒక్క నయా పైసా కూడా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించలేదని, అడిగితే బళ్లారి జిల్లాకు కేఎంఎఫ్, డీఎంఎఫ్ నిధులు ఉన్నాయని చెబుతూ రాష్ట్ర ప్రభుత్వం మొండిచేయి చూపిందని మండిపడ్డారు.

వేసవిలో ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి: డీహెచ్ఓ



ఓఆర్ఎస్ ద్రావణాన్ని పరిశీలిస్తున్న డీహెచ్ఓ రమేశ్‌బాబు

బళ్లారి సిటీ,మార్చి 20(ఆంధ్రజ్యోతి): వేసవిలో వేడి పెరిగే కొద్దీ ప్రజలు ఆరోగ్యం పట్ల మరింత జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డా.రమేశ్‌బాబు తెలిపారు.గురువారం జిల్లా ఆసుపత్రిలో ఓఆర్ఎస్ ద్రావణాన్ని పరిశీలించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎండవేడిమి నుండి ప్రజలు తమను తాము ఎలా రక్షించుకోవచ్చో ,ఎండ వేడిమి కారణంగా ఎవరైన వడదెబ్బకు గురైతే ఎలాంటి చర్యలు తీసుకోవాలో తెలియజేశారు. వదులుగా, లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలని, తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఉప్పు, చక్కెర కలిపిన నీటిని తరచుగా తాగాలని, పండ్ల రసాలు తాగాలన్నారు. మెత్తని కాటన్ వస్త్రంతో చెమటను తుడవాలని, నీరు, మజ్జిగ, స్ప్రింగ్ వాటర్ తాగి వేడిని అరికట్టవచ్చన్నారు. వేడిగా సుగంధ ద్రవ్యాలు లేని స్వచ్ఛమైన సాత్విక ఆహారాన్ని తినాలని, గాలి వెళ్ళే బూట్లు ధరించాలి. ఇంటి నుంచి బయటకు వెళ్ళేటప్పుడు శుభ్రమైన తాగునీటిని తమతో తీసుకెళ్లాలన్నారు. వేసవిలో కలుషిత నీటిని తాగడం వల్ల వాంతులు, విరేచనాలు వచ్చే అవకాశం ఉన్నందున, స్వచ్ఛమైన నీటిని తాగాలన్నారు. బహిరంగ ప్రదేశాలల్లో మలవిసర్జన లేదా మూత్ర విసర్జన చేయరాదని, రోడ్డు పక్కన తెరిచి ఉంచిన ఆహారాన్ని కోసి ఉంచిన పండ్లను తినరాదన్నారు. వండిన ఆహారాన్ని మూతతో కప్పాలన్నారు. అధిక ఉష్ణోగ్రత కారణంగా వడదెబ్బ తగిలే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలన్నారు. జిల్లాలో ఎండలు మండిపోతున్న దృష్ట్యా అన్ని తాలూకా ప్రభుత్వ ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పడకలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో గ్రామ స్థాయిలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌తో సహా ఒక ఓఆర్ఎస్ కార్నర్ ఏర్పాటు చేశామని, ఇక్కడ ఓఆర్ఎస్ ద్రావణం తయారు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచుతామన్నారు. వడదెబ్బ చికిత్సకు సంబంధించిన అత్యవసర మందుల కొరత లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దళిత సంఘం మహిళలు

బళ్లారి రూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాలికపై అత్యాచారం కేసులో నిందితుడు దేవ నాయక్‌ను కఠినంగా శిక్షించాలని కర్ణాటక దళిత సంఘం సమితి లిబ్రేషన్ ఆర్గనైజేషన్ మహిళా విభాగం అధ్యక్షురాలు జీ శాంత రాజ్యప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నగరంలో నిరసన చేపట్టి కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ జుబేర్ మహమ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు డాక్టర్‌పై గౌసియాబి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమల, ఉపాధ్యక్షురాలు ఈరమ్మ, మల్లేశ్వరి, యశోదమ్మ, దాక్షాయని, రేడియో పార్క్ మమత, రాష్ట్ర కార్యదర్శి బీటీ భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

హొసపేటలో చిరుజల్లులు



వర్షం కురుస్తున్న దృశ్యం

బళ్లారి సిటీ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా హొసపేటలో గురువారం చిరుజల్లులు కురిశాయి. మధ్యాహ్నం 3.50 గంటల ప్రాంతంలో హొసపేటనగరం, పరిసర ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది. మండుతున్న ఎండలతో చల్లని వర్షం కురవడంతో నగరవాసులు ఊరట చెందారు. రెండు రోజులుగా హొసపేట, సమీప ప్రాంతాల్లో ఉష్ణోగ్రత 38డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఎండలు గరిష్ఠ స్థాయికి చేరుకునే సమయానికి వర్షం కురవడం కొంత ఊరటనిచ్చింది.

జొన్న కొనుగోలు కేంద్రంలో రైతులకు అన్యాయం

● మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప ఆరోపణ



ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప

సిరుగుప్ప, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జొన్నల కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయ్యిందని మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప ఆరోపించారు. గురువారం సిరుగుప్ప పట్టణం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ వైఫల్యాలను ఖండిస్తూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సోమలింగప్ప మాట్లాడుతూ జొన్నల కొనుగోలు కేంద్రంలో రైతులకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. కనీసం మౌలిక సదుపాయాలు కల్పించడం కూడా లేదని ఆరోపించారు. వేదవతి నదికి ఎల్ఎల్‌సీ కాలువ ద్వారా సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పంట చేతికందే వరకు ఏప్రిల్ చివరి వరకు సాగునీటిని విడుదల చేయాలన్నారు. తహసీల్దార్ విశ్వనాథ్ ధర్నా స్థలాన్ని సందర్శించి జిల్లా అధికారులతో సమస్యలపై చర్చిస్తామని తెలపడంతో ధర్నా విరమించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ తాలుకా అధ్యక్షుడు కుంటనహాళ్ మల్లికార్జున స్వామి, రైతు నాయకులు, ఈరణ్ణగౌడ, శివప్ప, ఏపీఎంసీ మాజీ అధ్యక్షులు రారావి నాగేష్, మైకేల్ వీరేష, కౌన్సిలర్ మహదేవ, నాయకులు, కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

కల్లూరు మహాలక్ష్మి ఆలయంలో భారీ చోరీ

● శ్రీవారు, అమ్మవారి కిరీటాలు ఎత్తుకెళ్లిన దుండగులు ● సీసీ కెమెరాలు లేకపోవడంపై భక్తుల ఆగ్రహం



మహాలక్ష్మి ఆలయం

రాయచూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చారిత్రక ఆలయంగా ప్రసిద్ధి గాంచిన సిరవార తాలూకా కల్లూరు మహాలక్ష్మి ఆలయంలో భారీగా చోరీ జరిగింది. బుధవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఆలయంలోకి ప్రవేశించిన దుండగులు 30లక్షలకు పైగా విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలను దోచుకెళ్లారు. వెంకటేశ్వర స్వామి కిరీటం, అమ్మవారి కిరీటంతో పాటు పలు నగలను దొంగలు ఎత్తుకెళ్లారు. వీటిలో వెంకటేశ్వర స్వామి కిరీటం 80 గ్రాములు, అమ్మవారి కిరీటం 30 గ్రాములు ఉండగా స్వామివారి పాదాలు 140 గ్రాములుతో పాటు మరో 40 గ్రాములు ఉండే పతకాలను మొత్తం 290 గ్రాముల బంగారు చోరీ అయ్యింది. ఇంత భారీ మొత్తంలో ఆభరణాలు ఉన్న ఆలయంలో సీసీ కెమెరాలు లేకపోవడం గమనార్హం. ఇది గమనించిన దుండగులు సునాయాసంగా దొంగతనానికి పాల్పడినట్లు స్థానికులు భావిస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి చోరీపై కేసు నమోదు చేశారు.



అర్చకుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

తగ్గుతున్న భూగర్భ జలం..!

● విద్యుత్ కోతతో రైతుల ఇబ్బందులు ● ఎండుతున్న పంటలు ● అధికారులు స్పందించాలంటున్న అన్నదాత



నీరు అందక ఎండిపోతున్న బీట్‌రూట్ పంట

మడకశిర రూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ బోర్లలో నీటి మట్టం తగ్గిపోయింది. ప్రస్తుతం వస్తున్న అరకొర నీటికితోడు అధికారులు ఏడుగంటలే విద్యుత్ సరఫరా చేస్తుండటంతో రైతులు విలవిల్లాడుతున్నారు. రైతులు సాగు చేసిన అరకొర పంటలు వాడుదశకు చేరాయి. వ్యవసాయానికి తొమ్మిది గంటలు ఇవ్వాల్సి ఉండగా ఏడు గంటలు మాత్రమే ఇస్తున్నారని రైతులు వాపోతున్నారు. అమిదాలగొంది విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 4 నుంచి 11 గంటల వరకు, హరేసముద్రం పరిధిలో ఉదయం 11 నుంచి సాయంత్రం 6 వరకు, గోవిందాపురంలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మణూరు, కల్లుమర్రి పరిధిలోనూ ఇదే పరిస్థితి ఉంది. వ్యవసాయ బోరు బావుల కింద చాలా మంది రైతులు మిరప,పత్తి, మొక్కజొన్న, బీట్‌రూట్, వక్క తదితర పంటలు సాగు చేశారు. వేసవి కాలం కావడంతో బోర్లలో నీటి మట్టం తగ్గిపోయింది. దీనికితోడు విద్యుత్ అధికారులు కేవలం ఏడు గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తుండటంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వ్యవసాయానికి తొమ్మిది గంటల విద్యుత్ అందించాలని రైతులు కోరుతున్నారు.

తొమ్మిది గంటలు విద్యుత్ అందించాలి

వ్యవసయానికి తొమ్మిది గంటలు విద్యుత్ అందించాలి. మూడు ఎకరాల్లో బీట్‌రూట్, రెండు ఎకరాలు, వక్కతోట పంటలు సాగుచేశా. కల్లుమర్రి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో కేవలం 7 గంటలు మాత్రమే ఇస్తున్నారు. అందులోకూడా కోతలు విధిస్తున్నారు. దీంతో పంటలకు నీరు అందక ఎండిపోతున్నాయి. - నారాయణప్ప, రైతు, కల్లుమర్రి

ఏడు గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నాం: విశ్వనాథ్, విద్యుత్‌శాఖ ఏఈ, మడకశిర

వ్యవసాయానికి ఎక్కడా కోతలు విధించడం లేదు. నిరంతరాయంగా ఏడు గంటలు విద్యుత్ ఇస్తున్నాం. ఆయా సబ్ స్టేషన్ పరిధిలో రైతులకు అనుకూలమైన సమయాల్లోనే విద్యుత్ సరఫరా చేస్తున్నాం.



జెస్కాం అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్థులు

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని వినతి

బళ్లారి సిటీ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు అధికారులను కోరారు. బళ్లారి గుల్బర్గా విద్యుత్ సరఫరా కంపెనీ లిమిటెడ్ తాలూకాలోని శిడిగినమోళ గ్రామంలో గురువారం నిర్వహించిన ఫిర్యాదుల సమావేశంలో స్థానిక నాయకులు కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని జెస్కాం అధికారులకు విజ్ఞప్తి చేశారు. శిడిగినమోళ రంగయ్య, చన్న బసవనగౌడ, ఓంకార నాయుడు వంటి స్థానిక నాయకులు , సామాజిక కార్యకర్తలు జెస్కామ్ అధికారి మోహన్‌బాబుకు వినతి పత్రం సమర్పించి మాట్లాడారు. విద్యుత్ స్తంబాల మధ్య చాలా ఖాళీలు ఉన్నాయని, దీనివల్ల రైతులకు అనేక సమస్యలు ఎదురవుతున్నాయ న్నారు. శిడిగినమోళ గ్రామంలోనూ రైతులకు సౌకర్యంగా ఉండేలా వీటి మధ్య కొత్త విద్యుత్తు స్తంబాలను ఏర్పాటు చేయాలని కోరారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతు చేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశం నిర్వహించ చర్యలు తీసుకుంటామని విద్యుత్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో బి.భీమలింగ, బి.తాయన్న, రుద్రయ్య, లక్ష్మణ, నాగరాజు, సుంకయ్య, అజీమ్‌బాషా, రమేష్, ఓబులేశ్, యర్రిస్వామి, హొన్నూర్‌స్వామి తదితర గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గరుడోత్సవం



గరుడోత్సవంలో పాల్గొన్న భక్తులు

గంగావతి రూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): గంగావతి తాలూకా కనకగిరిలో రాష్ట్రంలోనే ఎంతో ప్రత్యేకమైన కనకాచలపతి గరుడోత్సవం గురువారం తెల్లవారుజామున ఎంతో ఉత్సాహంగా జరిగింది. కనకాచలపతి మహా రథోత్సవానికి ముందు రోజు జరిగే ఈ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఉత్సవాన్ని చూడడానికి భక్తులు విశేషంగా తరలివచ్చారు. సూర్యోదయానికి ముందే పసుపు రంగు గరుడ రథంపై లక్ష్మీదేవి, నరసింహుడి ఊరేగింపులో వేలాది మంది భక్తులు, గోవిందా గోవిందా అని నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ఈసందర్భంగా కొప్పళ జిల్లా ఇన్‌చార్జిమంత్రి శివరాజ్ తంగడ్గి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ గౌడ పాటిల్, బసవరాజ్ దడేసుగూర్, మాజీ జిల్లా పంచాయితీ సభ్యులు హనుమేశ్‌నాయక్, విద్యావతి తంగడ్గి, జిల్లా హామీ అమలు కమిటీ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్, తాహశిల్దార్ విశ్వనాథ్ మురడి, పట్టణ పంచాయితీ అధ్యక్షుడు హుస్సేన్, కంఠిరంగానాయక, కనకప్ప,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంగాధరస్వామి, ప్రచార కమిటీ అధ్యక్షుడు రమేశ్‌నాక్,మహంతేశ్ సర్జన్, హైదరాబాద్, దార్వాడ్,హవేరి, రాయచూరు, విజయనగరం, కొప్పళ, హంపీ, బళ్లారి, దావణగేరి, బెల్గాం, కలబురగి, విజయపుర, బాదలకోట భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నుల పంపిణీ



విద్యార్థులకు ప్యాడ్లు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

బళ్లారి సిటీ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని బళ్లారి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఇందిరానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండాలని ప్యాడ్లు, పెన్నులు అందజేశామన్నారు. విద్యార్థులు శ్రద్ధతో చదివి ఉత్తమ మార్కులు సాధించాలన్నారు. ఈసందర్భంగా రోటరీక్లబ్ మజీహార్ బాష, ప్రధానోపాధ్యాయులు వన్నూర్ బీ, సునీత, తదితర రోటరీ క్లబ్ సిబ్బంది పాల్గొన్నారు.

అత్యాచారాలను అరికట్టాలి

● ప్రభుత్వం మేల్కొనకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తాం
● గ్రామీణాభివృద్ధి మహిళా శక్తి సంఘం అధ్యక్షురాలు సరళ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సరళ కావ్య

విజయనగరం (హొస్పేట), మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో మహిళలపై అత్యాచారాలు, హింస, అన్యాయాలు జరగడం బాధాకరమని మారికాంబ గ్రామీణాభివృద్ధి మహిళా శక్తి సంఘం అధ్యక్షురాలు బి సరళ కావ్య అన్నారు. నగరంలోని జర్నలిస్ట్ అసోసియేషన్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా విలేకరుల సమావేశం నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ తమ సంఘం మహిళలకు విద్యపరంగా ప్రాధాన్యతనిచ్చే పాఠశాల విద్యార్థులకు అవసరమైన పరికరాలను వీలైనంత వరకు అందించిందన్నారు. ఇంకా మహిళలకు ఏదైనా అన్యాయానికి ప్రతిస్పందించడానికి వారికి న్యాయం అందించడానికి సంఘం నిజాయితీగా కృషి చేసిందన్నారు. రాబోయే రోజుల్లో రాజ్యాంగం ప్రకారం మహిళలకు సమాన హోదా కల్పించడానికి కొన్ని పోరాటాలు చేయడం తప్పనిసరి అయ్యిందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నగరంలో శాంతిభద్రతలు కాపాడాలి

● కరవే శివరామగౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్

బళ్లారి రూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): బళ్లారి గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రవిచంద్రను కర్ణాటక రక్షణ వేదిక శివరామగౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ గురువారం బేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో శాంతి భద్రతలు కాపాడాలని కోరారు. ఆయనతో పాటు కర్ణాటక రక్షణ వేదిక శివరామగౌడ సంఘం పదాధికారులు సురేష్, సుధాకర్, రాజు, డేవిడ్, మాం తేష్, గోపాల్, మురళి, దాదు సంఘం పదాధికారులు పాల్గొన్నారు.



సీఐ రవిచంద్రన్‌ను సన్మానిస్తున్న రాజశేఖర్